సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 13 । మే । 2023



దైవ దర్శనానికి వెళ్తూ తిరిగిరాని లోకాలకు..

దైవదర్శనానికి బయలుదేరిన ఇద్దరు మహిళలు వశిష్ట గోదావరి నదిలో గల్లంతయ్యారు. - వివరాలు IIలో▸

ఉష్ణోగ్రతలు

రాజమండ్రి
గరిష్టం: 42.0
కనిష్టం: 27.0

కాకినాడ
గరిష్టం: 39.6
కనిష్టం: 27.6

అమలాపురం
గరిష్టం: 37.7
కనిష్టం: 27.4



కడలిలోకి 7,423 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద శుక్రవారం గోదావరి ఉధృతి పెరిగింది. దీంతో మిగులు జలాల విడుదలను పెంచారు. బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 7,423 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.65 అడుగులకు చేరింది.



న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన అముడా చైర్మన్ డేవిడ్‌రాజు



కలెక్టర్ శుక్లాను సత్కరిస్తున్న అముడా చైర్మన్ డేవిడ్‌రాజు

కొత్తపేట: కలెక్టర్ హిమాన్షు శుక్లాను అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. అమలాపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ శుక్లాను శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. డేవిడ్‌రాజుకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

16న అంతర్వేదిలో స్వామివారి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీ లక్ష్మీ నృసింహుని ఆలయంలో ఈ నెల 16న స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నారు. అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ శుక్రవారం ఈ విషయం తెలిపారు. ఆర్జిత సేవగా నిర్వహిస్తున్న ఈ విశేష కార్యక్రమానికి ఏపీ టెంపుల్స్ వెబ్‌సైట్ ద్వారా, ఆలయంలో కౌంటర్ వద్ద ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

వాడపల్లి వెంకన్న సన్నిధిలో 'విరూపాక్ష' దర్శకుడు



కార్తీక్‌వర్మకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారిని 'విరూపాక్ష' చిత్ర దర్శకుడు దండు కార్తీక్‌వర్మ శుక్రవారం దర్శించుకున్నారు. రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామానికి చెందిన ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు ఆయనకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో ప్రతిభ

అమలాపురం టౌన్: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (ఎస్‌బీఎస్‌ఈ) ఫలితాల్లో అమలాపురానికి చెందిన 12వ తరగతి విద్యార్థి జనిపిరెడ్డి శరవణ సాయి బైపీసీలో ప్రతిభ చాటాడు. 500కు గాను 478 మార్కులు (95.6 శాతం) సాధించాడు. రాజమహేంద్రవరంలోని ప్రైవేటు కాలేజీలో 12వ తరగతి పూర్తి చేసిన సాయి నీట్ పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాడు. సాయి ప్రతిభ చూపడంతో అతడి తండ్రి, అమలాపురానికి చెందిన వ్యాపారవేత్త సురేష్‌ను పట్టణ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన వ్యాపారులు అభినందించారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో జెడ్పీ చైర్మన్



విఘ్నేశ్వరుని సన్నిధిలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి, కుటుంబ సభ్యులు

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామి వారిని జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, అంజిలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. వారికి అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదాశీర్వచనం చేసి, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: రత్నగిరికి భక్తులు పోటెత్తారు. గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. అలాగే ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న నవదంపతులు శుక్రవారం ఉదయం సత్యదేవుని ఆలయానికి తరలివచ్చారు. వారికి సాధారణ భక్తులు తోడవడంతో ఆలయం కిక్కిరిసింది. సుమారు 40 వేల మంది సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట పట్టింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.



జిల్లా ఉద్యోగులకు నెలవైన కలెక్టరేట్



కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు

ఫీల్ హ్యాపీ

- హెచ్‌ఆర్‌ఏ పెంపుపై ఉద్యోగుల హర్షాతిరేకాలు
- జిల్లాలో 1,700 మందికి పైగా లబ్ధి
- జాబితాపై అధికారుల కసరత్తు

సాక్షి, అమలాపురం: జిల్లా కేంద్రమైన **అమలాపురం** పరిధిలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగు**లకు హౌస్ రెంట్** అలవెన్స్ (ఇంటి అద్దె భత్యం – **హెచ్‌ఆర్‌ఏ**) పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు **జారీ చేసింది.** ప్రభుత్వ నిర్ణయం వల్ల వందలాది **మంది ఉద్యోగు**లకు జీతం పెరగనుంది. దీనిపై **ఉద్యోగులు, ఉద్యోగ** సంఘాల నాయకులు హర్షం వ్యక్తం **చేస్తున్నారు.**

పరిపాలనా సౌలభ్యం కోసం **ప్రభుత్వం గత** ఏడాది పార్లమెంటరీ నియోజకవర్గా**ల ప్రాతిపదికన** కొత్త జిల్లాలు ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా కొత్తగా ఏర్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు అమలాపురం పట్టణాన్ని కేంద్రంగా ఏర్పాటు చేశారు. అప్పటి వరకూ డివిజన్ కేంద్రంగా ఉన్న అమలాపురం కాస్తా జిల్లా కేంద్రంగా మారింది. కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయంతో పాటు అన్ని శాఖల జిల్లా కార్యాలయాలనూ ఇక్కడ ఏర్పాటు చేశారు. వాటిలో ఉద్యోగుల నియామకం కూడా జరిగింది. ఫలితంగా అమలాపురంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

పెరిగిన అద్దెలకు అనుగుణంగా..

జిల్లా కేంద్రంగా మారడం, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు రావడంతో పాటు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం అమలాపురం వస్తున్న వారి సంఖ్య కూడా పెరిగింది. దీంతో పట్టణంలోను, పట్టణాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లోను ఇంటి అద్దెలు భారీగా పెరిగాయి. గడచిన ఏడాది కాలంలో 15 నుంచి 30 శాతం వరకూ అద్దెలు పెరిగినట్లు అంచనా. ఇదే పరిస్థితి కొత్తగా జిల్లా కేంద్రాలైన భీమవరం, బాపట్ల, నర్సారావుపేట వంటి పట్టణాల్లో సైతం ఉంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం ఇలా **కొత్త జిల్లా కేంద్రాలైన తొమ్మిది పట్టణాల్లో హెచ్‌ఆర్‌ఏను 16 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జీఓ ఎంఎస్ నంబర్ 69 విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా విభజన తరువాత అమలా**పురంతో పాటు కాకినాడ, రాజమహేంద్రవరం సైతం జిల్లా కేంద్రాలయ్యాయి. కానీ అవి నగరపాలక సంస్థలు కావడంతో ఇప్పటికే అక్కడ 16 శాతం హెచ్‌ఆర్‌ఏ అమలవుతోంది.

వందలాది మందికి మేలు

ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ జీతంలో ప్రస్తుతం హెచ్‌ఆర్‌ఏ 12 శాతంగా ఉంది. దీనిని ప్రభుత్వం 16 శాతానికి పెంచింది. దీని వల్ల గ్రేడ్–1 ఉద్యోగి బేసిక్ జీతం కనిష్టంగా రూ.20 వేలపై రూ.800 వరకూ హెచ్‌ఆర్‌ఏ పెరగనుంది. అలాగే, గ్రేడ్–25 ఉద్యోగి బేసిక్ గరిష్టంగా రూ.1,66,680పై రూ.6,667 వరకూ హెచ్‌ఆర్‌ఏ పెరుగుతుంది. అమలాపురం పట్టణం, చుట్టుపక్కల 8 కిలోమీటర్ల పరిధిలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 1,700 వరకూ ఉందని అంచనా. తాజా ఉత్తర్వులతో అమలాపురం పట్టణంతో పాటు, చుట్టుపక్కల ఎనిమిది కిలోమీటర్ల పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ గణనీయంగా పెరగనుంది. అమలాపురం పట్టణం, మండలంలోని దాదాపు అన్ని గ్రామాలు; అంబాజీపేట, అయినవిల్లి, అల్లవరం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపా**ధ్యాయులు, కాలేజీల్లోని అధ్యాపకులు, సచివాలయ ఉద్యోగులు, పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామ పంచాయతీ, మున్సిపల్, పంచాయతీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీతో పాటు అన్ని** ప్రభుత్వ శాఖల ఉద్యోగులు హెచ్‌ఆర్‌ఏ పెంపు వలన లబ్ధి పొందనున్నారు.

వారికీ వర్తింపజేసేలా..

జిల్లా కేంద్రం అమలాపురంలో హెచ్‌ఆర్‌ఏ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీ భవనాల్లో ఉన్న వివిధ శాఖల జిల్లా అధికారులు, వారి కార్యాలయ సిబ్బందికి ఈ జీఓ వర్తిస్తుందా, లేదా అనే మీమాంస నెలకొంది. జిల్లా కేంద్రానికి ముమ్మిడివరం 14 కిలోమీటర్ల దూరంలో ఉంది. దూరం నిబంధనను పరిగణనలోకి తీసుకుంటే ఇక్కడ పని చేసే ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ పెరుగుదల ఉండదు. అయితే ఇక్కడ జిల్లా కార్యాలయాలను తాత్కాలికంగానే ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ జిల్లా కేంద్రానికి తరలించే అవకాశముంది. కొన్ని కార్యాలయాలు ఇప్పటికే అమలాపురం వచ్చాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎయిమ్స్ కాలేజీలో ఉన్న జిల్లా కార్యాలయాల్లోని ఉద్యోగులకు సైతం హెచ్‌ఆర్‌ఏ పెంచే అంశాన్ని జిల్లా యంత్రాంగం ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లనుంది. జీఓ రావడంతో ఉద్యోగులను గుర్తించే పనిలో రెవెన్యూ, ట్రెజరీ అధికారులు నిమగ్నమయ్యారు. దీనిపై వారం పది రోజుల్లో పూర్తి లెక్కలు రానున్నాయి. ఎయిమ్స్‌లోని ఉద్యోగులు కూడా హెచ్‌ఆర్‌సీ పెంపు పరిధిలోకి వస్తే లబ్ధి పొందే ఉద్యోగుల సంఖ్య 2 వేల వరకు పెరుగుతుందని అంచనా.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



కొత్తగా ఏర్పడిన జిల్లా కేం**ద్రం అమలాపురం**లో పని **చేసే ఉద్యోగు**లకు 16 **శాతం హెచ్‌ఆర్‌**ఏ అంగీక**రిస్తూ ప్రభుత్వం** ఉత్తర్వులు **జారీ చేయడం** హర్షణీయం**. ఇదేవిధంగా ఉ**ద్యోగ, ఉపాధ్యాయ సమస్యల **పరిష్కారంలో** ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉండాలని, **మా సమస్యల** పరిష్కారానికి కృషి చేస్తుందని **ఆశిస్తున్నాం.**

– నాగిరెడ్డి శివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు, ఎస్‌టీయూ

ఉద్యోగులకు మేలు



జిల్లా కేంద్రాల్లో పని చేసే ఉద్యోగులకు మేలు జరిగేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హెచ్‌ఆర్‌ఏ 16 శాతం చేయడం చాలా సంతోషంగా ఉంది. జిల్లా కేంద్రాల్లో పెరిగిన అద్దెలకు అనుగుణంగా హెచ్‌ఆర్‌ఏ పెంచారు. ఉద్యోగ సంఘాలు కోరిందే తడవుగా హెచ్‌ఆర్‌ఏ పెంచి ఉద్యోగుల మేలు కోరే వ్యక్తినని జగన్ మరోసారి నిరూపించారు.

– విప్పర్తి నిఖిల్‌కృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్

ఆక్వా రైతుకు అండగా ప్రభుత్వం



రఘురామ్, జేడీలను సన్మానిస్తున్న ఆక్వా రైతు నాయకులు

ఉప్పలగుప్తం: ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ అన్నారు. నర్సరీల్లో ఉత్పత్తి అవుతున్న రొయ్య సీడులో సాంకేతిక లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సరిపల్లిలోని అల్లూరి బయో సెక్యూర్ సీడ్ ఆక్వా నర్సరీలో శుక్రవారం ఆయన పర్యటించారు. రొయ్య సీడు నాణ్యతను పరిశీలించారు. అనంతరం అమలాపురం పురపాలక సంఘ అతిథి గృహంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లాల్ మహ్మద్, జిల్లా ఆక్వా రైతు సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పదెకరాల్లోపు ఉండి, ఆక్వా జోన్ పరిధిలో ఉన్న రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ విషయంలో గతంలో ఏమైనా పొరపాట్లు జరిగి ఉంటే సరిచేయాలని, అర్హులందరికీ సబ్సిడీ అందించాలని అధికారులకు సూచించారు. దీనిపై మత్స్యశాఖ అధికారులు సానుకూలంగా స్పందించి, చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాకు వచ్చిన రఘురామ్‌ను, జేడీ మహ్మద్‌లను రైతు నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో కోనసీమ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ అమలాపురం పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, రైతు సంఘ నాయకులు త్సవటపల్లి నాగభూషణం, వై.వెంకటానందం, అల్లూరి రమేష్‌రాజు, మేడిద శంకరం, మోటూరి నాని, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్య పల్లెలే లక్ష్యం



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో సత్యనారాయణ

- ఉత్తమ గ్రామాల ఎంపికకు 15 నుంచి విచారణ
- జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

కాకినాడ సిటీ: సంపూర్ణ ఆరోగ్య పల్లెలే లక్ష్యంగా ప్రతి అధికారీ ప్రణాళిక అమలు చేయాలని జెడ్పీ సీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని ఎంపీడీఓలు, గ్రామాల్లోని స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమాభివృద్ధి విచారణ కమిటీలకు స్వచ్ఛ సర్వేక్షణపై జెడ్పీ సమావేశపు మందిరంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెత్త నుంచి సంపద సృష్టి పథకాన్ని పటిష్టంగా అమలు చేయడం ద్వారా క్లీన్, గ్రీన్ గ్రామాల లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా గతంలో అధికారులు ప్రత్యేక యాప్‌లో స్వచ్ఛ గ్రామాల వివరాలు అప్‌లోడ్ చేశారన్నారు. దీనిపై కమిటీలతో పూర్తి స్థాయి విచారణ చేసి నివేదిక ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. విచారణ కమిటీలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్త, డ్వాక్రా సంఘం లీడర్ ఉంటారని చెప్పారు. వీరు పరిసరాల పరిశుభ్రత, క్లీన్, గ్రీన్ గ్రామాల రూపకల్పనపై విచారణ చేస్తారన్నారు. దీనికోసం గ్రామాలను మూడు రకాలుగా విభజించినట్లు తెలిపారు. 2,000 లోపు, 2000 – 5,000, 5,000 పైబడి జనాభా ఉన్న గ్రామాలుగా విభజించి విచారణ చేస్తారని వివరించారు. ఈ నెల 15 నుంచి 25వ తేదీ లోపు విచారణ పూర్తి చేయాల్సి ఉందని సత్యనారాయణ చెప్పారు. కమిటీ సర్వేపై మళ్లీ మండల, జిల్లా స్థాయి అధికారులు విచారణ చేసి, ఉత్తమ గ్రామాలను ఎంపిక చేస్తారని చెప్పారు. దీనిని ప్రభుత్వం పరిశీలించి ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి, అవార్డులు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో ఎ.రమణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాసరావు, డీఎల్‌డీవోలు, ఎంపీడీఓలు, విచారణ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చకచకా నాడు–నేడు పనులు

- వచ్చే నెల 12లోగా పూర్తి కావాలి
- అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: మన బడి నాడు–నేడు రెండో దశ పనులు చకచకా పూర్తి చేసి, జూన్ 12వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి సిద్ధం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో శుక్రవారం వివిధ అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

- మన బడి నాడు–నేడు ద్వారా మంజూరైన పనులు, రన్నింగ్ వాటర్‌తో టాయిలెట్ల వంటి పనులను త్వరితగతిన నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి. మున్సిపల్ పాఠశాలల్లో మన బడి నాడు–నేడు పనులను ఆయా కమిషనర్లు పూర్తిగా పర్యవేక్షించాలి. ఈ పనుల నిర్వహణలో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇంజినీర్లు, పీఆర్ ఇంజినీర్లు కీలకంగా వ్యవహరించాలి. ఈ పనుల బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. మున్సిపాలిటీల్లో ఎన్ని పాఠశాలలకు రివాల్వింగ్ ఫండ్ మంజూరైందో సమీక్షించారు.
- జిల్లాలో ఒక్కో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి రూ.16 లక్షలు కేటాయించారు. వీటి నిర్మాణాలు వేగవంతం చేసి, భవనాలను అందుబాటులోకి తీసుకురావాలి. స్థల సమస్యలున్న మూడుచోట్ల ప్రత్యామ్నాయ స్థలాల ఎంపికకు రెవెన్యూ శాఖ ద్వారా చర్యలు చేపట్టాలి.
- జగనన్న విద్యా కానుక పంపిణీకి సంబంధించి స్కూల్ బ్యాగులు, సరఫరా అయిన మెటీరియల్ నాణ్యతను పూర్తిగా పర్యవేక్షించాలి.
- మన బడి నాడు–నేడు మొదటి దశ పాఠశాలల తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన గ్రీన్ చాక్ బోర్డులను తొలగించి, ఆ స్థానంలో డిజిటల్ విద్యా బోధన కోసం 65 అంగుళాల ఎల్‌ఈడీ టీవీ ఏర్పాటు చేయాలి. తొలగించిన గ్రీన్ చాక్ బోర్డును ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేయాలి. టీవీకి ఇరువైపులా రెండు చిన్న గ్రీన్ చాక్‌బోర్డులు ఏర్పాటు చేయాలి.
- అమ్మ ఒడికి కార్యక్రమానికి సంబంధించిన సామాజిక తనిఖీని ఈ నెల 29కి పూర్తి చేసి, నివేదిక సమర్పించాలి.
- పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ తప్పనిసరిగా 11వ తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు పొందారో లేదో పర్యవేక్షించాలి. ఏ ఒక్క డ్రాపౌట్ లేకుండా గ్రామ/వార్డు వలంటీర్ల సహకారంతో చర్యలు తీసుకోవాలి.
- బరువు, ఎత్తు తక్కువ ఉన్న ఆరేళ్ల లోపు చిన్నారులు, 10 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు ఉన్న కిశోర బాలికలతో పాటు గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పోషకాహార లోపాలను నివారించాలి. తద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను పూర్తిగా సాధించాలి.
- మిషన్ వాత్సల్య పథకం ద్వారా పేద వర్గాల వారికి మేలు చేకూర్చాలి.
- రాయవరం మండలంలో స్పందన అర్జీల పెండింగ్, గడువు దాటిన రీ ఓపెన్ అర్జీలపై కలెక్టర్ హిమాన్షు శుక్లా సమీక్షించి, మండల అధికారులకు దిశానిర్దేశం చేశారు.
- కార్యక్రమంలో జిల్లా అధికారులు ఎం.దుర్గారావుదొర (వైద్య, ఆరోగ్య శాఖ), ఎం.కమలకుమారి (విద్యా శాఖ), జీవీ సత్యవాణి (స్త్రీ, శిశు సంక్షేమ శాఖ), సబ్ డివిజనల్ అధికారి డాక్టర్ సుమలత, ఎన్‌సీడీ కో ఆర్డినేటర్ జానీలివి, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి భీమేశ్వరరావు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డీఈ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక పక్కా.. ప్రగతి ఎంచక్కా..

- విద్యాభివృద్ధికి యూ–డైస్ ప్లస్ నమోదు
- పాఠశాలల సమగ్ర సమాచార సేకరణ
- తద్వారా మౌలిక వసతుల కల్పనకు మార్గం
- తుది దశలో నివేదికల తయారీ

రాయవరం: ఒక సంస్థ ప్రగతి పథంలో ముందుకు వెళ్లాలంటే నిర్దిష్ట ప్రణాళిక, అందుకు నిర్ణీత సమాచారం అవసరం. దేశ భవిష్యత్తుకు పునాదిరాళ్లుగా ఉన్న పాఠశాలల్లో మౌలిక, భౌతిక అవసరాల కోసం ఏటా రూపొందిస్తున్న ప్రణాళికల ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తాయి. ఇందుకోసం పాఠశాలల నుంచి వచ్చే సమగ్ర సమాచారమే ప్రాతిపదిక అవుతుంది. ఇందులో భాగంగా యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూ–డైస్) ప్లస్ ద్వారా సమాచార సేకరణ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 2,149 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలున్నాయి. వీటన్నింటి సమాచారాన్ని ఉపాధ్యాయుల, అధ్యాపకులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో సేకరించి, గత నెలలోనే ఆన్‌లైన్ చేశారు. ప్రస్తుతం ఈ వివరాలను పరిశీలించి, యూ–డైస్ ప్లస్‌కు తుది రూపు తీసుకు వచ్చే పనిలో విద్యా శాఖ తలమునకలుగా ఉంది.

యూ–డైస్ ప్లస్

గతంలో సమగ్ర జిల్లా విద్యా సమాచార వ్యవస్థను యూ–డైస్‌గా పేర్కొనేవారు. కరోనా కారణంగా 2020–21లో యూ–డైస్ రూపొందించలేదు. గత ఏడాది మరికొన్ని అంశాలను జోడించి, దేశవ్యాప్తంగా యూ–డైస్ ప్లస్‌గా పేరు మార్చారు. దీని ద్వారా పాఠశాలల సమగ్ర సమాచార సేకరణ, నమోదు చేపట్టారు. గతంలో ప్రధానోపాధ్యాయులు ఇచ్చిన సమాచారాన్ని, మండల, జిల్లా స్థాయిల్లో పరిశీలించిన అనంతరం రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ చేసేవారు. ఈ ప్రక్రియలో కొంత సమాచారం కోల్పోయే అవకాశం ఉన్నందున, గత ఏడాది నుంచి పాఠశాల స్థాయిలోనే నేరుగా ఆన్‌లైన్ ప్రక్రియ చేపడుతున్నారు.

ప్రతి అవసరానికీ యూ–డైస్ ప్రాతిపదిక

విద్యా వ్యవస్థలో విద్యాభివృద్ధికి ఏ కార్యక్రమం చేపట్టాలన్నా యూ–డైస్ ప్లస్ ప్రాతిపదికగా నిలుస్తుంది. పాఠశాలలకు అవసరమైన ఉపాధ్యాయ పోస్టుల మంజూరు, ఉన్న పోస్టుల రేషనలైజేషన్, కొత్తగా అదనపు తరగతి గదులు, తాగునీరు, టాయిలెట్లు, ర్యాంపులు, కిచెన్‌షెడ్లు, లేబరేటరీ, ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు ఉపకరణాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు.. ఇలా ఏది మంజూరు చేయాలన్నా కేంద్ర ప్రభుత్వం యూ–డైస్ ప్లస్ ద్వారా పంపే సమాచారాన్నే ప్రాతిపదికగా తీసుకుంటుంది. దీని ఆధారంగానే సమగ్ర శిక్షా అభియాన్‌కు నిధులు కేటాయిస్తుంది. అందుకే యూ–డైస్ ప్లస్ ద్వారా సేకరించే సమాచారం కీలకంగా మారుతుంది. యూ–డైస్ ప్లస్ నమోదులో విభిన్న ప్రతిభావంతులైన చిన్నారుల నమోదును చాలా కీలకంగా భావించాల్సి ఉంటుంది.



జిల్లాలో పరిస్థితి ఇదీ..

- జిల్లావ్యాప్తంగా వివిధ యాజమాన్యాల పరిధిలో 2,049 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో ప్రభుత్వ యాజమాన్యాల కింద 1,592, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 457 ఉన్నాయి.
- వీటిలో మండల పరిషత్/జెడ్పీ, మున్సిపల్, ప్రైవేటు అన్ ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలో 1,412 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి.
- ప్రభుత్వ, ఏపీ ఆర్‌ఈఐ సొసైటీ, ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ, మండల పరిషత్/జెడ్పీ, మున్సిపల్, ప్రైవేటు ఎయిడెడ్, ప్రైవేటు అన్ ఎయిడెడ్, ప్రైవేటు అన్ ఎయిడెడ్ (సీబీఎస్‌ఈ), ప్రైవేటు అన్ ఎయిడెడ్ (ఐసీఎస్‌ఈ), మదర్సా యాజమాన్యాల పరిధిలో 244 ప్రాథమికోన్నత, 393 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.
- ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 1,21,914 మంది, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 85,780 మంది విద్యార్థులు చదువుతున్నారు.
- ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల కింద జిల్లాలో 100 జూనియర్ కళాశాలలున్నాయి.

కచ్చితమైన వివరాలు



పాఠశాలల హెచ్‌ఎంలు క్షేత్రస్థాయిలో ఉన్న కచ్చితమైన సమాచారాన్ని అందజేశారు. వారు ఇచ్చే సమాచారం ఆయా పాఠశాలల అభివృద్ధికి కీలకంగా మారనుంది. ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల వివరాలను యూ–డైస్ ప్లస్‌లో తీసుకున్నాం. అన్ని పాఠశాలల సమగ్ర సమాచారాన్నీ పకడ్బందీగా సేకరించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకున్నాం.

– ఎం.కమలకుమారి, అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్, ఏపీ సమగ్ర శిక్షా, అమలాపురం

కీలక సమాచారం సేకరణ



పాఠశాలలకు సంబంధించిన కీలక సమాచారం యూ–డైస్ ద్వారా సేకరించాం. ఉపాధ్యాయులు అందజేసిన సమాచారాన్ని జిల్లా స్థాయిలో పరిశీలించే ప్రక్రియ తుది దశలో ఉంది. సమాచారం నమోదుకు పాఠశాల, సమాచారం పంపిణీకి జిల్లాను ప్రామాణికంగా నిర్ధారించారు.

– దొమ్మేటి తాతారావు, సహాయ గణాంక అధికారి, డీఈఓ కార్యాలయం, అమలాపురం

లారీ, ట్యాంకర్ ఎదురెదురుగా ఢీ

- ఒకరి మృతి
- ఇద్దరికి గాయాలు


ట్యాంకర్ క్యాబిన్ నుంచి డ్రైవర్ శ్రీహరిని బయటకు తీస్తున్న స్థానికులు

రంగంపేట: ఎదురెదురుగా వస్తున్న లారీ, ట్యాంకర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఎస్సై టి.రామకృష్ణ కథనం ప్రకారం.. నిడదవోలుకు చెందిన వానపల్లి శ్రీహరి (50) ట్యాంకర్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడు ట్యాంకర్‌తో శుక్రవారం రాజమహేంద్రవరం వైపు నుంచి కాకినాడ వెళ్తూ.. ఏడీబీ రోడ్డుపై రంగంపేట మండలం కోటపాడు – రామేశంపేట గ్రామాల మధ్యకు చేరుకున్నాడు. అదే సమయంలో కాకినాడ వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వేగంగా వస్తున్న లారీ ఆ ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీహరి రెండు కాళ్లూ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి, నుజ్జునుజ్జయిపోయాయి. అతడిని స్థానికులు అతి కష్టం మీద క్యాబిన్‌లో నుంచి బయటకు తీసి, పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ నాగరాజుకు, ఆ సమయంలో బైక్‌పై వెళ్తున్న మరో వ్యక్తి కూడా గాయపడ్డారు. క్షతగాత్రులను పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం కారణంగా రెండు లారీలూ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనంతరం పోలీసులు ఆ లారీలను స్టేషన్‌కు తరలించారు.

+2పై ప్రత్యేక శ్రద్ధ

- సబ్జెక్టు టీచర్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ
- అర్హులైన ఎస్ఏలను నియమించేందుకు కసరత్తు
- ఉమ్మడి తూర్పున 335 మందికి అవకాశం
- ఎంపికైన వారికి అదనంగా ఒక ఇంక్రిమెంట్

రాయవరం: పదో తరగతి పూర్తి చేసిన అనంతరం దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా బాలికలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. దీనిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రతి మండలానికి ఒక బాలికల జూనియర్ కళాశాలను గత విద్యా సంవత్సరంలో ప్రారంభించారు. 2022–23 విద్యా సంవత్సరం నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 45 హైస్కూళ్లను జూనియర్ కళాశాలలు(+2 స్కూల్స్)గా గుర్తించి, ఇంటర్ తరగతులు ప్రారంభించారు. ఆయా ఉన్నత పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో బోధన సాగించారు. అయితే ఇంటర్‌లో ఆశించిన ఫలితాలు రాలేదు. దీనిని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం +2 స్కూల్స్‌లో ఇంటర్ విద్యా బోధనను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా స్కూల్ అసిస్టెంట్లలో అర్హత ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయులను జూనియర్ కళాశాలల్లో నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది.

మంజూరైన పోస్టులు

తెలుగు	48
ఇంగ్లిషు	48
గణితం	40
ఫిజిక్స్	47
కెమిస్ట్రీ	47
బోటనీ	39
జువాలజీ	39
సివిక్స్	9
ఎకనామిక్స్	9
కామర్స్	9

జిల్లాల వారీగా +2 స్కూల్స్ వివరాలు

జిల్లా	ప్రభుత్వ	జెడ్పీ
తూర్పు గోదావరి	--	09
కాకినాడ	02	13
కోనసీమ	--	21

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే..

2023–24 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే +2 పాఠశాలల్లో అర్హులైన సబ్జెక్ట్ టీచర్ల నియామకానికి చర్యలు చేపట్టారు. హైస్కూల్+ నిర్వహిస్తున్న పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రాతిపదికన అర్హతలు ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు ఒక ఇంక్రిమెంట్‌తో ఆర్థిక ప్రయోజనం కల్పించి, పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు అర్హత, ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీనివలన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 335 మంది స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం లభించనుంది. దీనికి దరఖాస్తు చేసేందుకు శనివారం సాయంత్రం వరకూ ప్రభుత్వం గడువు ఇచ్చింది.


రాయవరంలోని +2 పాఠశాల

దరఖాస్తులు వచ్చాయి



+2 హైస్కూల్స్‌లో సబ్జెక్టు టీచర్లుగా పని చేసేందుకు అర్హత ఉన్న స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా నోటిఫికేషన్ జారీ చేశాం. అందుకు అనుగుణంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. నిబంధనల ప్రకారం అర్హత, ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేస్తాం.

– కేఎస్‌పీఎస్ అన్నపూర్ణ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నోడల్ అధికారి, కాకినాడ

మంచి ఫలితాలు వస్తాయి



ఇంటర్మీడియెట్ కోర్సుల ప్రాధాన్యం దృష్ట్యా నాణ్యమైన బోధన లభిస్తుంది. మంచి ఫలితాలు వచ్చే అవకాశముంటుంది. సబ్జెక్టు టీచర్ల నియామకంతో బోధన మెరుగుపడుతుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో +2 స్కూల్స్‌కు మంచి రోజులు రానున్నాయి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

కొవ్వూరులో రేపు గౌడ జనభేరి

- సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ, బహిరంగ సభ
- పాల్గొంటున్న మంత్రులు తానేటి వనిత, జోగి రమేష్, ఎంపీ భరత్

కొవ్వూరు: పట్టణ శివారున ఉన్న గామన్ ఇండియా బ్రిడ్జి జంక్షన్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు గౌడ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తాతా కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం అక్కడ 'గౌడ జనభేరి' బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గౌడ సంఘ నాయకులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణారావు మాట్లాడారు. గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు గౌడ్ మాట్లాడుతూ, దేశంలో మొఘల్ చక్రవర్తులకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తెలిపారు. గోల్కొండ కోటను ఏడున్నర నెలలు పాలించిన పోరాట యోధుడని, 30 ఏళ్ల పాటు దేశవ్యాప్తంగా 21 కోటలు నిర్మించారని చెప్పారు. విలేకర్ల సమావేశంలో నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు బొర్రా కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

187 సెల్‌ఫోన్ల రికవరీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చోరీకి గురైన, పోగొట్టుకున్న రూ.40 లక్షల విలువైన 187 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. వీటిని బాధితులకు జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి అందజేశారు. దిశ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు చాట్‌బాట్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారని, వాటిని వీలైనంత వేగంగా రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నామని చెప్పారు. చాట్‌బాట్ ప్రారంభించిన తర్వాత తొలి విడతగా సుమారు రూ.22,30,500 విలువైన 120 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. రెండో విడతగా సుమారు రూ.36 లక్షల విలువైన 170 సెల్‌ఫోన్లు రికవరీ చేశామని ఎస్పీ తెలిపారు. తాజాగా రికవరీ చేసిన 187 సెల్‌ఫోన్లలో 21 కేరళ, చెన్నై ప్రాంతాలకు చెందినవన్నారు. కొన్ని సెల్‌ఫోన్లను బిహార్, ఢిల్లీ, హైదరాబాద్ నుంచి రికవరీ చేశామని చెప్పారు. చాట్‌బాట్ సేవలు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకూ సుమారు రూ.98,30,500 విలువైన 477 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి, బాధితులకు అందజేశామని తెలిపారు. దొరికిన సెల్‌ఫోన్లను సొంతానికి వాడుకోరాదని, గుర్తు తెలియని వ్యక్తుల ద్వారా బిల్లులు లేని సెల్‌ఫోన్లు కొనరాదని చెప్పారు. దొరికిన సెల్‌ఫోన్లను దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు అందజేయాలని అన్నారు. అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) జి.వెంకటేశ్వరరావు, డీఎస్పీ (క్రైమ్స్) జి.గురునాథ్‌బాబు, షరీఫ్ సెల్‌ఫోన్ల రికవరీని స్వయంగా పర్యవేక్షించారని ఎస్పీ తెలిపారు.


రికవరీ చేసిన సెల్‌ఫోన్లను చూపుతున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

అప్పులు.. కుటుంబ సమస్యలు

- తాళలేక పురుగు మందు తాగిన వ్యక్తి
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

అల్లవరం: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అల్లవరం ఎస్సై శ్రీనునాయక్ కథనం ప్రకారం.. అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి శ్రీనివాసరావు (50) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ అవసరాల రీత్యా శ్రీనివాసరావు సుమారు రూ.5 లక్షల వరకూ అప్పులు చేశాడు. అవి తీరే దారి కనిపించ లేదు. దీనికి తోడు కుమారుల నుంచి సహాయ సహకారాలు లేకపోవడంతో అప్పులు మరింతగా పెరిగాయి. పెద్ద కుమారుడికి వివాహమైంది. దంపతుల మధ్య గొడవల కారణంగా అతడికి భార్య దూరంగా ఉంటోంది. రెండో కుమారుడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. అతడి భార్య కూడా అనారోగ్యంతో మృతి చెందింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తీరని మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు.. గురువారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో హుటాహుటిన అంబులెన్స్‌లో కాకినాడ తరలిస్తుండగా మార్గం మధ్యలో శ్రీనివాసరావు మృతి చెందాడు. అతడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీను నాయక్ తెలిపారు.


శ్రీనివాసరావు మృతదేహం

దైవ దర్శనానికి వెళ్తూ
తిరిగిరాని లోకాలకు..

- వశిష్ట గోదావరిలో మహిళ, బాలిక గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం

ఆత్రేయపురం/నిడదవోలు రూరల్/ఉండ్రాజవరం: దైవదర్శనానికి బయలుదేరిన ఇద్దరు మహిళలు వశిష్ఠ గోదావరి నదిలో గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది. ఈ విషాద సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం కట్టుంగ గ్రామం వద్ద చోటు చేసుకుంది. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం మునిపల్లికి చెందిన తుమ్మలపల్లి కొండమ్మ (48), ఉండ్రాజవరం మండలం దమ్మెన్ను గ్రామానికి చెందిన జిన్నూరు కౌసల్యాదేవి (17) కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరారు. పశ్చిమ గోదావరి జిల్లా తీపర్రు నుంచి కాలి నడకన వాడపల్లి చేరడానికి.. వశిష్ఠ గోదావరి పాయ, ఆత్రేయపురం మండలం కట్టుంగ గ్రామం మీదుగా దగ్గర మార్గం. దీంతో వారు గోదావరి వెంబడి కాలి నడకన వస్తున్నారు. ఆ సమయంలో గోదావరి ప్రవాహం ఉధృతి ఎక్కువగా ఉంది. దీంతో కట్టుంగ సమీపానికి వచ్చేసరికి గోదావరి దాటుతున్న కొండమ్మ, కౌసల్య ప్రవాహ ఉధృతికి నదిలో కొట్టుకుపోయారు. గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. ఆత్రేయపురం ఎస్సై సీహెచ్ సుధాకర్, సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కొండమ్మ మృతదేహం లభ్యం కాగా, కౌసల్య ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కు తీర్చుకునేందుకు బయలుదేరి..

మృతురాలు కొండమ్మ భర్త గాలీబు బార్బర్‌గా పని చేస్తున్నాడు. వారికి ఇద్దరు కుమారులు రామాంజనేయులు, లక్ష్మీగణపతి ఉన్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారికి మొక్కు తీర్చుకునేందుకు కొండమ్మ బయలుదేరిందని, ఈ క్రమంలో మృత్యువాత పడిందంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అలాగే, ఈ ఘటనలో గల్లంతైన కౌసల్యాదేవి తండ్రి గోవింద్ కూడా నాయీబ్రాహ్మణుడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కౌసల్యాదేవి రెండో కుమార్తె. దైవ దర్శనానికి వెళ్లిన కుమార్తె గోదావరిలో గల్లంతవ్వడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనలతో ఆ కుటుంబాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.


మృతురాలు కొండమ్మ (పాత చిత్రం)


గల్లంతైన కౌసల్య (పాత చిత్రం)

రెండు లారీలు దగ్ధం

- అగ్నికి ఆహుతైన వస్తువులు
- రూ.కోటి ఆస్తి నష్టం

అంబాజీపేట: ఉన్నట్టుండి రెండు లారీలు దగ్ధమైన సంఘటన అంబాజీపేటలో కలకలం రేపింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.కోటి ఆస్తినష్టం సంభవించింది. స్థానికులు, శ్రీ పట్టాభి రామ లారీ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్ అధినేత పేరిచర్ల చిన సూర్యనారాయణ కథనం ప్రకారం.. విజయవాడ నుంచి వివిధ ఫ్యాన్సీ వస్తువులు, టింబర్, కిరాణా, వస్త్రాలు, పుస్తకాలు తదితర లోడుతో ఓ లారీ గురువారం సాయంత్రం స్థానిక లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయానికి వచ్చింది. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఆ లారీ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నికీలల్లో లారీతో పాటు వస్తువులు కాలిపోతున్న సమయంలో భయంకరమైన పేలుడు శబ్దాలు వచ్చాయి. దీంతో నిద్రలో ఉన్న స్థానికులు ఒక్కసారిగా అదిరిపడి లేచారు. ఆ ప్రాంతమంతా విపరీతమైన వేడి వాతావరణం ఏర్పడి, పొగలు కమ్ముకున్నాయి. పేలుళ్లు, వేడికి తాళలేని స్థానికులు ప్రాణభయంతో ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. తేరుకున్న అనంతరం ప్రమాదంపై ట్రాన్స్‌పోర్టు సిబ్బందికి స్థానికులు ఫోను ద్వారా సమాచారం అందించారు. మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ ప్రమాదంలో పి.విజయలక్ష్మికి చెందిన లోడు లారీ, అందులోని వస్తువులు, పక్కనే ఉన్న మరో ఖాళీ లారీ అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అమలాపురం, కొత్తపేట అగ్నిమాపక అధికారులు కె.మురళీ కొండబాబు, బి.ప్రభాకరరావు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.65 లక్షల విలువైన వస్తువులు, రూ.35 లక్షల విలువైన లారీలు పూర్తిగా కాలిపోయాయి. ఈ రెండు లారీల పక్కనే మరో లారీ ఉంది. దానిని స్థానికులు, డ్రైవర్ అక్కడి నుంచి తప్పించారు. ఈ ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలాన్ని ఎస్సై ఎ.చైతన్యకుమార్ సందర్శించి, సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. బాధితుడు చినసూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, రాష్ట్ర లారీ యూనియన్ ఉపాధ్యక్షుడు వాకపల్లి స్వామినాయుడు, యూనియన్ ప్రతినిధులు నల్లా శ్రీరాములు, బొక్కా త్రిమూర్తులు, వేండ్ర బుజ్జి తదితరులు పరిశీలించారు.


ప్రమాదంలో కాలి బూడిదైన లారీలు, వస్తువులు


గోదావరిలో మృతదేహం లభ్యం


కొవ్వూరు: కుమారదేవం గ్రామ సమీపాన గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. రూరల్ ఎస్సై జి.సతీష్ కథనం ప్రకారం.. మృతుడి వయస్సు సుమారు 28 నుంచి 32 సంవత్సరాలు ఉంటుంది. జీన్ ఫ్యాంటు వేసుకుని ఉన్నాడు. ఒంటిపై చొక్కా లేదు. నాలుగైదు రోజుల కిందట మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహం పాక్షికంగా పాడైంది. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలూ లభ్యం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై సతీష్ సూచించారు.


హోంగార్డ్‌పై కేసు


ముమ్మిడివరం: నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం విక్రయిస్తున్న వారికి యానాం నుంచి మద్యం సరఫరా చేస్తున్న హోంగార్డ్, అతడి బావమరిదిని ఎస్సై కె.సురేష్‌బాబు శుక్రవారం అరెస్టు చేశారు. మండలంలోని సీహెచ్ గున్నేపల్లి నల్లావారిపేటలో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం విక్రయిస్తుండగా ఇటీవల బండారు నాగబాబు, సుంకర రామకృష్ణలను అరెస్టు చేశారు. ఈ కేసును పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. హైవే మొబైల్ వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్న అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన హోంగార్డ్ కురసా రాము, సాకుర్రు గున్నేపల్లికి చెందిన అతడి బావమరిది పవిడికొండల వెంకట అరవింద్ కలిసి, యానాం నుంచి అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్నట్టు నిర్ధారించుకున్నారు. నిందుతులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

సీబీఎస్ఈలో 'నవోదయం'


బి.సుబ్బలక్ష్మి


జి.రామ్‌చరణ్


పీవీవీఎస్ సత్యదేవ


వైవీవీఎస్ నాగగణేష్

పెద్దాపురం: సీబీఎస్ఈలో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో శత శాతం ఉత్తీర్ణత సాధించారని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి తెలిపారు. పదో తరగతిలో 75కు 75 మందీ ఉత్తీర్ణులయ్యారు. బి.సుబ్బలక్ష్మి 96.4 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచింది. 92.8 శాతంతో జి.రామ్‌చరణ్ ద్వితీయ, 91.6 శాతంతో బి.కశ్యప్, ఎస్.దినేశ్ తృతీయ స్థానాలు సాధించారు. పదో తరగతిలో 75.26 శాతం తరగతి సరాసరితో 64 మంది విద్యార్థులు ప్రథమ, 11 మంది ద్వితీయ స్థానాలు పొందారు. అలాగే 12వ తరగతి సైన్స్ విభాగంలో 42 మంది విద్యార్థులకు గాను 41 మంది ప్రథమ, ఒకరు ద్వితీయ స్థానం సాధించారు. తద్వారా నూరు శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. జవహర్ నవోదయ విద్యాలయ చరిత్రలోనే పీవీవీఎస్ సత్యదేవ 96.2 శాతం (481/500) మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, 94.2 శాతం మార్కులతో వైవీవీఎస్ నాగగణేష్ ద్వితీయ, 93.2 శాతం మార్కులతో ఎస్ఎస్ఎస్‌కే ఉమేశ్ తృతీయ స్థానాల్లో నిలిచారు. ఆర్ట్స్ విభాగంలో 20 మందికి గాను 19 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 13 మంది ఫస్ట్‌క్లాస్, ఆరుగురు సెకండ్ క్లాస్ పొందారు. 92.2 శాతం మార్కులతో ఆర్.గురు విఘ్నేష్, 85.4 శాతం మార్కులతో వి.లావణ్య, 80 శాతం మార్కులతో కె.జయలక్ష్మి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 99.14 శాతం ఉత్తీర్ణతతో సీబీఎస్ఈలో నవోదయ విద్యాలయాలు దేశంలోనే ముందు వరుసలో నిలిచాయని రామిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.